ఉమ్మడి జిల్లాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు



జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	12.2
రంగారెడ్డి	మంగల్‌పల్లి	11.5
మేడ్చల్	ఘట్‌కేసర్	13.0



ధారూరు: తరిగోపులలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్


అప్పుల్లో ఉన్నా సంక్షేమం ఆగదు

ప్రజా ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ధారూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సంక్షేమం ఆగదని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తరిగోపులలో గురువారం స్వర్గీయ కొలుకుంద సంగమేశ్వర్ స్మారక పిల్లల పార్కు, మురికికాల్వలు, సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ధారూరు, అవుసుపల్లి, గట్టేపల్లి, రాజాపూర్ గడ్డమీది గంగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నాగారం, హరిదాసుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సీఎంఆర్‌ఎఫ్, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా అసలు, మిత్తి కడుతూ ఓ వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పనులు చేయటం సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం వల్ల హామీల అమలు అలస్యమవుతుందని, అయినా ఇచ్చినా హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. మండలంలో రూ.7 కోట్ల 50లక్షలతో సీసీ రోడ్డు నిర్మించి ప్రారంభించుకున్నామని తెలిపారు. భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నదని, 16 శాతం వరకు తేమ ఉన్నా పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐకి లేఖ రాశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొలుకుంద సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, పీఏసీఎస్ చైర్మెన్ సత్యానారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐ యుగంలోనూ విజ్ఞాన బాంఢాగారాలైన గ్రంథాలయాలు సేవల్లో భేష్ అనిపించుకుంటున్నాయి. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నారు. అయితే పాఠకులు ఆశించిన స్థాయిలో వీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయ తలుపులు తెరవకముందే చేరుకొని పుస్తక పఠనంలో లీనమవుతుండడం విశేషం. నేటి నుంచి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు పలు రకాల పోటీలతో పాటు పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.



- అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు
- అధ్యయనంతో అపార మేధో సంపత్తి
- సమస్యలు వెంటాడుతున్నా
- పాఠకులకు లైబ్రరీల సేవలు
- వేధిస్తున్న ఉద్యోగుల కొరత
- నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా వివరాలు

కేంద్ర గ్రంథాలయం	1
శాఖా గ్రంథాలయాలు	17
పుస్తకాలు	3,05,766
సభ్యులు	14,250

విజ్ఞానం

వికసించేలా..

వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోటీ పరీక్షల్లో అభ్యర్థులు తమ సత్తా చాటుకునేందుకు గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లోని గ్రంథాలయాలకు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులు విధిగా రోజూ హాజరవుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం తెరవక ముందే వచ్చి.. మూసివేసే సమయం వరకు చదువుకొని ఇళ్లకు వెళ్తున్నారు. దినపత్రికలు, స్టడీ మెటీరియల్‌ను అక్కడే నెమరువేసుకుంటున్నారు. ఏడాది కాలంలో జిల్లాలో గ్రంథాలయాలకు క్రమం తప్పకుండా వచ్చి పోటీ పరీక్షలు రాసిన వారు వందకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

విజ్ఞాన సర్వస్వం.. జిల్లా కేంద్ర గ్రంథాలయం

వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, చిన్నారులు, వృద్ధులు, మహిళలకు ఎంతో ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పరిశోధనలకు ఉపయోగపడే రెఫరెన్స్ గ్రంథాలు కూడా అందుబాటులో ఉంచడం విశేషం. వీటితోపాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల దినపత్రికలు, వివిధ వార, పక్ష, మాస పత్రికలు పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నారు. చారిత్రక, భౌగోళిక, రాజకీయ, సామాజిక, విజ్ఞాన, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, సాహిత్య కళారంగాలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలు జిల్లా గ్రంథాలయంలో ఉన్నాయి. తెలంగాణ, భారతదేశ, ప్రపంచ

మిగతా 8వ పేజీలో...

పాఠకులతో గ్రంథాలయాలు కళకళ



వికారాబాద్ లైబ్రరీలో పాఠకులు

రెగ్యులర్ ఉద్యోగులు తొమ్మిది మందే..

జిల్లాలోని పౌర గ్రంథాలయాల్లో మొత్తం 37 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా, తొమ్మిది మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో తొమ్మిది మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. జిల్లాలో 14 గ్రంథ పాలకుల పోస్టులు ఉండగా, ముగ్గురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కొక్కరికీ రెండు, మూడు గ్రంథాలయాల బాధ్యతలు అప్పగించారు. గ్రంథపాలకులు లేకపోవడంతో రికార్డు అసిస్టెంట్లు, వాచ్‌మెన్లతో కూడా గ్రంథాలయాలను కొనసాగిస్తున్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్న ప్రభుత్వం పౌర గ్రంథాలయ శాఖ పట్ల మాత్రం దృష్టి సారించకపోవడం గమనార్హం. గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న గంగ్యానాయక్

షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి

కులకచర్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఆర్‌పీ ఉద్యోగులకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సమగ్ర శిక్షా సీఆర్‌పీల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ కోరారు. గురువారం ఆయన కులకచర్లలో మాట్లాడుతూ విద్యార్థుల డ్రా బాక్స్ విషయంలో సీఆర్‌పీ ఉద్యోగులను బలి చేయడం సరైంది కాదన్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో డ్రా బాక్స్‌లో ఉండేందుకు కళాశాలలు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను యూడైస్ ప్లస్‌లో చేర్చుకోవడమే ప్రధాన కారణం అన్నారు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సమన్వయం చేస్తూనే ఉన్నామని తెలిపారు. అయినా ఉన్నతాధికారులు కాంట్రాక్టు ఉద్యోగులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడి సీఆర్‌పీ ఉద్యోగులకు షోకాజ్ నోటీసు జారీ చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. సమగ్ర శిక్షా సంచాలకులు వెంటనే షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు రఘు, షైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట

అక్రమాలు 8

ఇసుక, మొరం పక్కదారి

పట్టించుకోని అధికారులు

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్

వికారాబాద్/బొంరాస్‌పేట్/పరిగి/నవాబుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులకే డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించాలని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, తదితర అంశాలపై ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్ బోర్డు ఇంజినీర్లు, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని ఎన్నెపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 12 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఎక్కువ ఖర్చు అవుతుందనే భయంతో కొంత మంది లబ్ధిదారులు పనులు మొదలు పెట్టడం లేదన్నారు. అలాంటివారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇల్లు మంజూరైనా పనులు ప్రారంభించకపోతే ఇల్లు రద్దవుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి డీఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దశరథ్ సింగ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని వీపీ.గౌతమ్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్‌తో కలిసి బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంటలో, నవాబుపేట మండలం ఫైతాబ్‌ఖాన్‌గూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. బిల్లుల మంజూరుపై ఆరా తీశారు. ఆయనవెంట ప్రజా ప్రతినిధులు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి సిద్దు, హజీమలాంగ్‌బాబా ఉన్నారు. అలాగే పరిగి మునిసిఫల్ పరిధిలోని మూడో వార్డులో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, హౌజింగ్ బోర్డ్ డీఈఈ ముక్రంబాబా, ఏఈ రోజా, వార్డు ఆఫీసర్ ఫారూక్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఏజాజ్ ఉన్నారు.



హోటల్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

మేడ్చల్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లు వాడిన వ్యాపార స్తులపై కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని కేఎల్‌ఆర్ వెంచర్ శివాజీ చౌరస్తా వద్ద దుకాణాలు, హోటళ్లలో గురువారం తనిఖీ చేశారు. వ్యాపారస్తుల వద్ద నుంచి ప్లాస్టిక్ కవర్లను జప్తు చేసి రూ.45వేలు జరిమానా విధించారు. ఇకపై వారానికి ఒకసారి దుకాణాలను, హోటళ్లను తనిఖీ చేస్తామని తెలిపారు. ఇకపై హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లు దొరికితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న స్వర్ణకుమారి

సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో ఔట్ పేషెంట్ సేవలు రోజూ 80 నుంచి 100 వరకు ఉండేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం గర్భిణులకు పరీక్షలు, మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం, గురువారం అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీల్లో అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని సూచించారు. టీబీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి పీహెచ్‌సీను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిరోషా, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ఉచితాలకు స్వస్తి పలకాలి

- వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ శ్రీనివాస్



వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వాలు ఉచితాలకు స్వస్తి పలకాలని, ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్యం, రవాణా సదుపాయాలను మెరుగు పర్చాలని తెలంగాణ జేఏసీ పశ్చిమ రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్, వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్ కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ప్రజలు ఉచితాలను అడగడం లేదని, రాజకీయ పార్టీలే ఉచితాల పేరుతో ఎర వేస్తూ ఓట్లు దండుకుంటున్నాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ఆర్థిక సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయని ఆరోపించారు. స్వరాష్ట్రంలో విద్య, వైద్యం, రవాణా రంగాలపై ప్రభుత్వాలు సరైన దృష్టి సారించలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థలు నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని, ఎయిడెడ్ విద్యా సంస్థలు దాదాపు మూత పడ్డాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సరైన మందులు, డాక్టర్లు, సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు సరిగా లేక, ప్రమాదాలు జరిగి మరణాలు చోటు చేసుకున్నప్పుడు ప్రభుత్వాలు కొంత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఆచి తూచి

రైస్ మిల్లర్లతో పూర్తికాని అగ్రిమెంట్



- ధాన్యం సేకరణ.. అప్పగింతపై సమాలోచనలు
- డిఫాల్టర్లకు ససేమిరా అంటున్న సివిల్ సప్లయి శాఖ
- జిల్లాలో జోరందుకున్న వరి కోతలు
- 129 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- లక్షా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

తాండూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు జోరందుకున్నాయి. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి లక్షా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని సివిల్ సప్లయి శాఖ లక్ష్యం పెట్టుకుంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 20 రైస్ మిల్లర్లతో అగ్రిమెంట్ చేసుకునేందుకు నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే కస్టమ్ మిల్లింగ్ రైస్‌పై మిల్లర్లతో అగ్రిమెంట్ చేసుకునే విషయమై సివిల్ సప్లయి శాఖ ఆచీతూచి అడుగులు వేస్తోంది.

పకడ్బందీగా అగ్రిమెంట్లు

గత యాసంగిలో 98 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వాటిని బియ్యంగా మార్చి ఇచ్చేందుకు రైస్ మిల్లర్లతో సివిల్ సప్లయి శాఖ ఒప్పందం చేసుకుంది. వాటికి సంబంధించిన ప్రక్రియ గత మంగళవారంతో ముగిసింది. అయితే డిఫాల్టర్‌లో ఉన్న మిల్లర్లతో ఈసారి ఎట్టి పరిస్థితిల్లోను అగ్రిమెంట్ చేసుకోవద్దని అధికారులు నిర్ణయించారు. 2023 నుంచి మిల్లర్లకు కేటాయించిన వడ్లకు సంబంధించి బియ్యం ఇంకా

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

కోట్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నలభై వేల మంది సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం డిమాండ్ చేశారు. గురువారం కోట్‌పల్లి మండల పరిధిలోని టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మోత్కుపల్లి, ఎన్నారంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీం కోర్టు సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనులను అప్పగించడంతో సిలబస్ విషయంలో విద్యార్థులు వెనుకబడిపోతున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పనిచేసేందుకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకర్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గోపాల్, కవిత, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమస్యల సత్వర పరిష్కారం: ఎస్పీ

వికారాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం లభిస్తుందని, ఈ నెల 15 వరకు జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. రాజీకి వీలున్న కేసుల్లో పరస్పర సమ్మతితో ఇరువర్గాలు రాజీపడేలా లోక్ అదాలత్ దోహదపడుతుందని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో రాజీ సాధ్యమని వివరించారు. సైబర్ నేరాల బాధితులు రూ.25 వేల లోపు లోక్ అదాలత్ ద్వారా రీఫండ్ పొందే అవకాశం ఉందని తెలిపారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

తాండూరులో కార్డెన్ సెర్చ్

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలోని మాణిక్‌నగర్‌లో గురువారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో తాండూరు పట్టణ, రూరల్ సీఐలు సంతోష్ కుమార్, నగేష్, డివిజన్‌కు చెందిన ఎస్ఐలు, 40 మంది పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 44 బైకులు, రెండు ఆటోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.



సిమెంట్ కర్మాగారం రోప్‌వే పిల్లర్లను పరిశీలించిన సర్వేయర్

తాండూరు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్కటూర్ శివారులో గల అదానీ సిమెంట్ కర్మాగారం రోప్‌వే పిల్లర్లను సర్వేయర్ మహేశ్ గురువారం పరిశీలించారు. కర్మగారం వెనుక గతంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన పిల్లర్లను సర్వేయర్ కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఆ పిల్లర్ల గుంత బాస్పల్లి రెవెన్యూలో నిర్మించారనే అంశంపై పరిశీలించామని చెప్పారు. కర్మాగారం సిమెంట్ ఉత్పత్తులను పెంచేందుకే రోప్‌వేను నిర్మించనున్నట్లు సమాచారం. అందుకే పిల్లర్లను మరోసారి సర్వేయర్‌తో పరిశీలించినట్లు తెలుస్తోంది.

నవాంద్గీలో ఎంపీ నిధులతో బోరు



బషీరాబాద్,నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీ నిధులతో నవాంద్గీలో గురువారం బోరు వేశారు. నీటి సమస్యపై స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు దగ్గరుండి డ్రిల్లింగ్ చేయించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజ్‌కుమార్ కులకర్ణి, మండలాధ్యక్షుడు జగన్, గిరిజాపూరం రాఘవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిహారం పెంచి ఆదుకుంటా



ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన మొండిగౌరెల్లి రైతులు

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత భూ పరిహారం పెంచి ఆదుకుంటామని, ఎకరానికి రూ.26లక్షలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అసైన్డ్ భూములను ప్రభుత్వం ప్రజా అవసరాలకు తీసుకుంటుందని ఆయన అన్నారు. గురువారం మొండిగౌరెల్లి రైతులు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిసి తమకు ఎకరానికి రూ.60లక్షలు ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తెస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆక్రోశ సభను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు


కొందుర్గు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు బిక్షపతి కోరారు. గురువారం కొందుర్గులో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆక్రోశ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరు బీసీ పోరాటంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో లాలయ్య, మల్లేష్, రవీందర్, గిరి, రఘు, నవీన్, కృష్ణయ్య, నర్సిములు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి

బషీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న తహసీల్దార్, ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల సురేశ్ గురువారం సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నవాంద్గీ కాగ్నా వాగులో ఇసుక తవ్వుతున్నా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

నేడు నాగిళ్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడ్గుల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నాగిళ్ల రైతు వేదిక వద్ద శుక్రవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఐకేపీ ఏపీఎం శోభ గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఆమనగల్లు ఏఎంసీ ఛైర్‌పర్సన్ గీత హాజరవుతాని తెలిపారు. ఎ-గ్రేడ్ వడ్లు క్వింటాలుకు రూ.2,389, సాధారణ గ్రేడ్‌కు రూ2,369, సన్న వడ్లకు అదనంగా 500 బోనస్ ఇస్తామని వివరించారు. వడ్లలో తేమ 17శాతానికి మించొద్దని తెలిపారు.























పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వెళ్లనున్న జిల్లా కళాకారులు

టీటీడీ బ్రహ్మోత్సవాలకు జిల్లా కళాకారులు

తాండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి జరగనున్న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తెలంగాణ తరుఫున వికారాబాద్ జిల్లా కళాకారులు పాల్గొనున్నారు. తాండూర్ ఫైన్ ఆర్ట్స్ కల్చరర్ అకాడమి డ్యాన్స్ మాస్టర్ ఆధ్వర్యంలో 60 మంది బృందం గుస్సాడి, కోయ, బతుకమ్మ, కోలాట ప్రదర్శన ఇవ్వనున్నారు. కార్యక్రమంలో జానపద కళాకారుడు అశోక్ పాల్గొనున్నాడు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

తాండూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరన్‌కోట్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. హెచ్‌ఎం హేమలతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 355 మంది విద్యార్థులకు 289 మంది హాజరయ్యారని తెలిపారు. పాఠశాల గదిలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. బియ్యంలో కొంత పురుగులు, బెడ్డలు ఉండటంతో హెచ్‌ఎంపై అసంతృప్తి



కరన్‌కోట్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

వ్యక్తం చేశారు. అన్నం వండే ముందే బియ్యాన్ని శుభ్రం చేయాలని చెప్పారు. బియ్యం నాణ్యత లేకుంటే సివిల్‌సప్లయీస్ అధికారులకు రిటర్న్ చేయాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంఈవో వెంకటయ్య ఉన్నారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, బోధనా విధానంపై ఎంఈవో పరిశీలించారు. నాణ్యమైన విద్యను అందించాలని హెచ్‌ఎం బారీ, టీచర్లు దస్తప్ప, శివకుమార్‌లకు సూచించారు.



రిటైర్డ్ ఇంజనీర్ అరుణ్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

రిటైర్డ్ ఇంజనీర్ మృతదేహానికి స్పీకర్ నివాళి

వికారాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఇంజినీర్ అరుణ్‌కుమార్ గురువారం మరణించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌లు ఆయన ఇంటికి వెళ్లి అరుణ్‌కుమార్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను నేతలు పరామర్శించారు.



రూ.20లక్షల చెక్కును అందజేస్తున్న ఆర్‌ఎం ఎల్.శీల, బ్యాంకు సిబ్బంది

బీమా పథకాల్లో భాగస్వాములు కావాలి

కేశంపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు అందించే బీమా పథకాల్లో ఖాతాదారులు భాగస్వాములు కావాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎల్.శీల అన్నారు. కొత్తపేటలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సామాజిక భద్రతలో భాగంగా ఖాతాదారులకు బ్యాంకులు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు అందిస్తోందని తెలిపారు. ఖాతాదారులు ఆయా పథకాల్లో రిజిష్టర్ కావాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలు ఎవ్వరికీ చెప్పొద్దని సూచించారు. ఫోన్‌లో బ్యాంకు సిబ్బంది ఓటీపీలు అడగరని గుర్తుచేశారు. సైబర్ మోసాలతో డబ్బు పోతే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కొత్తపేట బ్రాంచ్‌లో గన్నె సురేష్ ఖాతాదారుడు రూ.వెయ్యితో బీమా తీసుకున్నాడని, అతడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా రూ.20లక్షల బీమా రాగా నామినీ మల్లయ్యకు చెక్కును ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సోమ్‌నాథ్, ఫీల్డ్ ఆఫీసర్ వీరకుమార్, బిజినెస్ మేనేజర్ కిషోర్, ఎఫ్‌ఐసీ మహేశ్వర్‌రెడ్డి, ఫాలి, సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి, ఎస్‌బీఐ బీడీఎంలు గోపి, అలీ పాల్గొన్నారు.

సన్నిధాన పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసీ తండాలో నిర్మిస్తున్న అయ్యప్ప సన్నిధాన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తండా బీఆర్‌ఎస్ నాయకులను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆదేశించారు. గురువారం మహేశ్వరంలో ఓ కల్యాణ మండపాన్ని ప్రారంభించిన అనంతరం కేసీ తండాలో అయ్యప్ప స్వాముల సన్నిధాన పనులను బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మోతీలాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్, ప్రభాకర్, ఆదిల్‌అలీ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా

» రైతు మలిపెద్ది కౌశిక్‌రెడ్డి ఆరోపణ



ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను హైడ్రా అధికారులు ఉల్లంగించి తమ భూమి ప్రహరీగోడ కూల్చి, పంట పొలాన్ని ధ్వంసం చేశారని ప్రతాప్‌సింగారానికి చెందిన రైతు మలిపెద్ది కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతాప్‌సింగారంలోని సర్వే నంబర్లు 315, 316 పార్టుల్లోని 6ఎకరాల 14గుంటల భూమి తమ తండ్రి మలిపెద్ది మధుసున్‌రెడ్డి పేరిట ఉందన్నారు. భూమికి ప్రహరీ నిర్మించి పండ్ల తోట, కూరగాయలు పండిస్తున్నామని తెలిపారు. అయితే సర్వే నంబర్ 317లో ప్లాట్లు కొన్నట్టు కొందరు హైడ్రాను తప్పుదోవ పట్టించి తమ పట్టా భూమిలోనే ప్లాట్లు ఉన్నాయని ప్రహరీ కూల్చేయించారని వాపోయారు. తమ భూమిలో ఎలాంటి కూల్చివేతలు చేయొద్దని హైకోర్టు నుంచి స్టేటస్‌కో తెచ్చుకున్నా హైడ్రా ప్రహరీని కూల్చి పంటలను ధ్వంసం చేసిందన్నారు. తమ భూమిలో ఎలాంటి లేఅవుట్ లేదని గతంలోనే పంచాయతీ, ప్రస్తుత పోచారం మునిసిపల్ అధికారులు సైతం ఎన్వోసీ ఇచ్చారని తెలిపారు. కూల్చివేతల అనంతరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, నాగిరెడ్డి, ఇ.మల్లేష్ తమ పంట భూమిలోని డ్రిప్ సిస్టాన్ని ధ్వంసం చేశారని, వీరిపై మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

నేడు 'మీ డబ్బు.. మీ హక్కు' అంశంపై శిబిరం

ఇబ్రహీంపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'మీ డబ్బు.. మీ హక్కు' అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలకనుగుణంగా శుక్రవారం కలెక్టరేట్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు డీపీఆర్వో వెంకటేశం గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కూల్చిన బస్టాప్ పునర్నిర్మాణం

ఘట్‌కేసర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూల్చిన బస్టాప్‌ను మున్సిపల్ అధికారులు తిరిగి వారితోనే నిర్మింపజేస్తున్నారు. 'రెచ్చిపోయిన రియల్ వ్యాపారులు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించి మున్సిపల్ కమిషనర్ రాజేష్ విచారణ జరిపి చర్యలు చేపట్టారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో బస్టాప్‌ను కూల్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారి తన తప్పును ఒప్పుకొని కూల్చిన చోటే బస్టాప్‌ను తిరిగి నిర్మిస్తున్నాడు. రోడ్డు జాగాలో ఉన్న బస్టాప్‌ను కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు చేశామని కమిషనర్ తెలిపారు. కాగా ప్రయాణికుల కోసం ఎప్పుడో నిర్మించిన బస్టాండ్‌ను గతంలో ఉన్నట్టుగా నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో బస్టాప్‌ను తిరిగి నిర్మిస్తున్న ప్లాట్ యజమాని

ఆకలి తీర్చుతున్న అల్పాహారం

» సీఎం నియోజకవర్గంలో 306 పాఠశాలల్లో అమలు
» పెరిగిన విద్యార్థుల హాజరు శాతం
» వయాట్రిస్, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్‌ల సహకారంతో నిర్వహణ
» సీఎం చొరవతో త్వరలోనే ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం



అల్పాహారం తింటున్న విద్యార్థినులు



కొడంగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఎంతో మేలు చేస్తోంది. అల్పాహార పథకంతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో హరే రామ, హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ఈ పథకం సత్ఫలితాలిస్తోంది. చాలా మంది పేద విద్యార్థులు ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు హాజవుతారు. మధ్యాహ్న భోజనం వరకూ ఆకలితో చదువుపై దృష్టి సారించలేకపోతారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ పరిధి పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నారు. వయాట్రిస్ సంస్థ, హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా అల్పాహారాన్ని అందిస్తున్నారు. 8 మండలాల్లోని 306 ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పెడుతున్నారు. అయితే ఈ సంస్థ ఆధ్వర్యంలో త్వరలోనే మధ్యాహ్న భోజనాన్ని సైతం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో శ్రీకారం చుడుతున్నారు. కాగా ఇప్పటి వరకు భోజన కార్మికులు పాఠశాలల ప్రాంగణాల్లో వండి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. త్వరలో మధ్యాహ్న భోజనాన్ని సైతం సెంట్రల్ కిచెన్‌లో వండి స్కూళ్లకు సరపరా చేస్తారు. హైజీనిక్ ఫుడ్ పంపిణీ లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని తటపెట్టారు. కాగా అల్పాహార పథకంతో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. కొడంగల్ బాలికల పాఠశాలలో 670 మంది విద్యార్థినులు ఉన్నారు. అల్పాహార పథకానికి ముందు ప్రార్థన సమయానికి 250 మంది వరకు యాబ్సెంట్ అయ్యేవారు. అల్పాహారంతో ఇప్పుడు పాఠశాల సమయానికి 500 మంది బాలికలు వస్తున్నారని తెలిపారు.



వాహనాలతో అల్పాహారం చేరవేత

కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల్లోని 306 ప్రభుత్వ పాఠశాలలకు 19 వాహనాలతో అల్పాహారాన్ని సరపరా చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని అల్పాహార కేంద్రంలో 60 మందికిపైగా సిబ్బందితో వండుతున్నారు. కొడంగల్, బొంరాస్‌పేట్ దౌల్తాబాద్, దుద్యాల్, కొత్తపల్లి, మద్దూర్, కోస్గి మండలాల్లోని పాఠశాలల 26,157 మంది విద్యార్థులకు టిఫిన్లు అందిస్తున్నారు. అల్పాహారంలో ఆరు రోజులకు ఆరు రకాల టిఫిన్లు అందజేస్తున్నారు. దోశ, ఇడ్లీ సాంబారు, రాగి ఇడ్లీ, మైసూర్ బోండా, చట్నీ ఉప్మా సాంబారు, పూరి ఆలూ కుర్మా, పొంగలి వడ్డిస్తున్నారు.

పథకం సత్ఫలితాలిస్తోంది



సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ బడుల్లో నిర్వహిస్తున్న అల్పాహార పథకం మంచి ఫలితాలు ఇస్తోంది. వయాట్రిస్, హరే రామ హరే కృష్ణ సంస్థల సహకారంతో 6 డిసెంబరు, 2024 నుంచి అల్పాహార పథకం అమలవుతోంది. బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ముందు ప్రభుత్వ స్కూళ్లలో 23,200 మంది విద్యార్థులు ఉంటే పథకం అమలు తరువాత వారి సంఖ్య 26,157 మందికి చేరింది.

- కృష్ణ చైతన్య, డీఎం, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్

దొంగ నోట్ల ముఠాకు తాండూరుతో లింకులు

హైదరాబాద్‌లో పట్టుబడిన ముఠా

» గతంలో తాండూరు కేంద్రంగా నకిలీ కరెన్సీ తయారీ
» పట్టణంలో భారీ నకిలీ నోట్ల చలామణి



నిందితుడు కస్తూరి రమేశ్‌బాబు

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు కేంద్రంగా కొంత కాలం రూ.500 ఫేక్ కరెన్సీ తయారీ చేసి ఇక్కడి నుంచి దందాను హైదరాబాద్‌కు మార్చిన తర్వాత అక్కడి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. తాండూరులోనూ నకిలీ నోట్లు చలామణి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రూ.500 నకిలీ నోట్లు భారీగా చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈ ముఠాను పట్టుకోవడంలో తాండూరు పోలీసులు విఫలమయ్యారు. కోస్గి మండలం గుండుమల్‌కు చెందిన కస్తూరి రమేశ్‌బాబు తన సోదరి రామేశ్వరి తాండూరు పరిధి కోకట్‌లో ఓ ఇంట్లో నివాసం ఉంది. అక్కడ రమేశ్‌బాబు నకిలీ నోట్లు తయారు చేశాడు. వాటి చలామణికి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారు. కొందరు నకిలీ నోట్ల చలామణి ముఠాలో చేరారు. ఒక్క ఒరిజనల్ రూ.500కు నాలుగు నకిలీ రూ.500 నోట్లు ఇచ్చి మార్పిడి చేయించారు. తర్వాత రమేష్‌బాబు హైదరాబాద్‌లోని మెహదీపట్నానికి మకాం మారాడు. దొంగ వ్యవహారం బట్టబయలు కావడంతో పోలీసులకు పట్టుబడ్డారు. రమేశ్‌బాబు, రాజేశ్వరిలపై గతంలోనే నకిలీ నోట్ల కేసులు నమోదయ్యాయి. తాండూరు కేంద్రంగా నకిలీ నోట్ల వ్యవహారం నడిపిన వీరితో ఇక్కడి పలువురుతో సంబంధాలున్నాయి. పోలీసులు లోతుగా విచారణ జరపాల్సి ఉంది.

తాండూరు డీఎస్పీ డీజీపీ కార్యాలయానికి అటాచ్

కొత్త డీఎస్పీగా నర్సింగ్‌యాదయ్య

» పోలీసుల పని తీరుపై ఉన్నతాధికారుల అసంతృప్తి
» డీఎస్పీపై వేటు గురించి ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
» ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐల బదిలీకి అవకాశం

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ డీజీపీ శశిధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డీఎస్పీగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ డీఎస్పీ నర్సింగ్‌యాదయ్యను నియమిస్తున్నారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డిపై వచ్చిన పలు ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో వేటు తప్పదని పోలీసు శాఖలో చర్చ జరిగింది. కేసుల విచారణ విషయంలో ఉన్నతాధికారులు ఆయన విధి నిర్వహణ తీరుతో అసంతృప్తిగా ఉన్నారని, తాండూరు పోలీసుల పని తీరు సరిగా లేదని, బదిలీలకు రంగం సిద్ధమైందని ఆంధ్రజ్యోతిలో అక్టోబరు 11న కథనం ప్రచురితమైంది. చోరీ కేసుల ఛేదనలో పోలీసుల వైఫల్యం, సివిల్ తగాదాల్లో తలదూర్చడం, సెటిల్‌మెంట్లకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలొచ్చాయి. అక్రమార్కులకు డీఎస్పీ కార్యాలయం ప్రాధాన్యం ఇచ్చి గంటల తరబడి వారితో చర్చలు జరిపిందని, సరైన న్యాయం జరగడం లేదని బాధితులు ఆరోపించారు. ఓ



తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

జిప్సం ఫ్యాక్టరీ లావాదేవీల వ్యవహారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో డీఎస్పీ ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రజాసంఘాలు ధర్నాలు చేశాయి. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం డీఎస్పీ పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే డీఎస్పీని ట్రాన్స్‌ఫర్ చేసినట్టు చర్చించుకుంటున్నారు. కాగా తాండూరులో ఇద్దరు సీఐల బదిలీ కూడా జరగొచ్చనే వార్తలొస్తున్నాయి. అలాగే పెద్దేముల్, బషీరాబాద్ ఎస్‌ఐలను ట్రాన్స్‌ఫర్ చేస్తారనే చర్చా సాగుతోంది. ఇదిలా ఉంటే కరన్‌కోట్ ఎస్‌ఐ బదిలీ కాకుండా ఓ కాంగ్రెస్ నాయకుడు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి వద్ద గట్టి ప్రయత్నమే చేయగా బదిలీకి బ్రేక్ పడినట్లు సమాచారం.

విధుల పట్ల నిర్లక్ష్యం

తాండూరు పీఆర్ ఈఈని ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్
ఇన్‌చార్జిగా వికారాబాద్ ఈఈకి బాధ్యతల అప్పగింత

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తాండూరు డివిజన్ పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అత్యవసర ప్రభుత్వ పనులను పూర్తిచేయకపోవడం, అందుకు సరియైన వివరణ ఇవ్వకపోవడంతో ఈఈ సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కొన్ని రోజుల క్రితం కలెక్టర్ ప్రతీక్‌జైన్ పీఆర్ చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. సదరు అధికారి విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాడని లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు. తాండూరు పీఆర్‌కు ప్రత్యామ్నాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కేటాయించాలని కోరారు. దీంతో ప్రభుత్వం వికారాబాద్ డివిజన్ పీఆర్ ఈఈ ఉమేష్ కుమార్‌ను తాండూరు డివిజన్‌కు ఇన్‌చార్జిగా నియమించింది.

నడవలేని వారికి ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పూర్తిగా నడవలేని దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అధికారులకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలోని శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో సంక్షేమ పింఛన్లపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పింఛన్‌దారుల్లో భర్త, లేదా భార్య మరణిస్తే దరఖాస్తులను పరిశీలించి దంపతుల్లో ఒకరికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సందర్శించి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకంపై అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించి అధికారులకు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ నుంచి పెన్షన్ డైరెక్టర్ గోపాల్‌రావు, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాటజీ డైరెక్టర్‌కు సత్కారం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగు కళాశాల స్ట్రాటజీ డైరెక్టర్ కొమ్మూరి దివ్యశ్రీకి 'ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ' అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో బచ్పన్ బచావో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ భారత సీఎస్‌ఆర్ సమ్మిట్-2025లో దివ్యశ్రీకి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో దివ్యశ్రీని కాలేజీ యాజమాన్యంతో పాటు డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, ఏవో నాగరాజు, అధ్యాపకులు సత్కరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నందుకే అవార్డు లభించిందన్నారు.



కొమ్మూరి దివ్యశ్రీని అభినందిస్తున్న డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు



శిక్షకులతో ప్రభాకర్

కలరిపయట్టు శిక్షకులను కలిసిన సినీ నటుడు ప్రభాకర్

దుద్యాల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్‌లో మూడు రోజులుగా కలరిపయట్టు శిక్షణ కొనసాగుతోంది. పంచాయతీ ఆవరణలో గురువారం శిక్షణ కొనసాగుతుండగా ఇటీవల గ్రామానికి వచ్చిన బాహుబలి సినీ నటుడు ప్రభాకర్ శిక్షకులతో కాసేపు ముచ్చటించారు. కేరళలో ప్రత్యేకంగా నేర్పించే ఈ విద్య గురించి ప్రధాన శిక్షకుడు రమేశ్ వివరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రత్యేకత కలిగిన ఈ విద్యను బాల్యం నుంచే నేర్చుకోవడం ఉత్తమం అన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



మొండిగౌరెల్లిలో వరి పంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడి

యాచారం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మేలు రకం వరి విత్తనాలు వాడి అధిక దగుబడులు సాధించాలని, కేఎన్‌ఎం1638 రకం వరి విత్తనాలు నాణ్యమైనవని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త వాణిశ్రీ తెలిపారు. రైతన్నకు నేస్తం అనే కార్యక్రమం చేపట్టి అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై క్షేత్రస్థాయిల్లో గురువారం రైతులకు వివరించారు. వరి పొట్ట దశలో యూరియా చల్లితే తాలు వస్తుందని చెప్పారు. సేంద్రియ ఎరువులు వాడితే లాభాలు వస్తాయన్నారు. తమ పొలంలోనే నాణ్యమైన విత్తనాలు తయారు చేసుకోవడంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో రవినాథ్ తదితరులు ఉన్నారు.

అంగడి చిట్టెంపల్లిని సందర్శించిన శాస్త్రవేత్తలు

పూడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంగడిచిట్టెంపల్లిలో గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పర్యటించారు. శాస్త్రవేత్తలు అరుణశ్రీ, పద్మజ, మల్లయ్య, ఏవో తులసిరాంతో కలిసి పంటల సాగుపై రైతులకు సూచలను, రైతు ఉత్పాదక సంఘాల ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ఎలియాస్, మాజీ సర్పంచ్ షకీల్, మాజీ ఎంపీటీసీ విఠలయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

మూడు నెలల్లో గుంతలు లేని రోడ్లు

● తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులు డిసెంబరు నాటికి నాణ్యతతో పూర్తి చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో రోడ్లు భవనాలు, ఇరిగేషన్ అధికారులతో వేర్వేరుగా సమీక్షించారు. నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్లు, పనులు నాణ్యతతో ఉండాలని వాహనదారులకు ఇబ్బందులు తలెత్తరాదని అన్నారు. వివిధదశల్లో నిర్మాణంలో ఉన్న రోడ్లపనులపై సమీక్షించారు. అనంతరం నియోజకవర్గంలో నీటిపారుదల ప్రాజెక్టులపై జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నీటిపారుదల ప్రాజెక్టులు వేగవంతం కావాలని ఆదేశించారు. రోడ్లు అధ్వానంగా ఉంటే సహించేది లేదన్నారు. తాండూరు-కోట్‌పల్లి, యాలాల మండలం బాగాయిపల్లి రోడ్డుపనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ శ్రీధర్‌రెడ్డి, తాండూరు డీఈఈ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత



స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేయిస్తున్న స్థానికులు

కోట్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి నాగసమందర్ గేట్ వరకు గల మెయిన్‌రోడ్డుపై గుంతలుపడి రోడ్డు పాడవడంతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మండలానికి చెందిన కొందరు యువకులు కలిసి నాగసమందర్ గేటు నుంచి కోట్‌పల్లి వరకు గల ప్రధానరోడ్డుపై జేసీబీ సాయంతో గుంతల్లో మట్టివేశారు. దీంతో వాహనదారులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామిదాస్, మహేందర్ ఉన్నారు.

ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంఈవో జమదగ్ని

కీసర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలను గురువారం కీసర మండల విద్యాధికారి జమదగ్ని ప్రారంభించారు. పాఠశాల ఏర్పాటుకు చొరవ తీసుకున్న కలెక్టర్, జిల్లా విద్యాధికారికి ధన్యవాదాలు తెలిపారు. ఉన్నత పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్, పరశురాం, మక్బుల్, అనిత, తస్మిన్‌బేగం, సుశీల పాల్గొన్నారు.

తాండూరులో బీసీల ధర్మపోరాట దీక్ష

తాండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం బీసీల ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సుకుర్, గడ్డం వెంకటేష్, అనిత, మంజుల, విజయలక్ష్మి, నర్సమ్మ, శివలీల, లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

దుద్యాల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుదురుమళ్లకు చెందిన మణికంఠ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.3లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు మణికంఠ కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాశ్‌రెడ్డి, రాజు, గోవింద్ పాల్గొన్నారు.

ఎంపీవోలకు సన్మానం

కులకచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలానికి నూతనంగా వచ్చిన మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్‌ను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఆయనతో పాటు గత రెండు సంవత్సరాలుగా ఎంపీవోగా విధులు నిర్వహించిన కులకచర్ల పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్‌నూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

యాలాల: మూడు సంవత్సరాలుగా యాలాల మండలంలో ఎంపీవోగా పనిచేసిన యాదయ్య నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో యాదయ్యకు యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, భీమప్ప పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

కులకచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రాములు అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం మండలంలోని పుట్టపహాడ్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేశ్, వెంకటేశ్, రమేశ్, అజ్మత్, మల్లేశ్ యాదవ్, నర్సిములు, రమేశ్, ప్రకాశం పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

ఘట్‌కేసర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉన్న ప్రతీఒక్కరు రక్తదానం చేయాలని సంస్కృతి గ్రూప్‌ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ ఏవీ రమాణారెడ్డి అన్నారు. కొండాపూర్‌లో గల సంస్కృతి గ్రూప్‌ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో గురువారం రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 150మంది విద్యార్థులు రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర కృష్ణ, రమాకాంత్‌రెడ్డి, ప్రొఫెసర్ జానకీరాములు, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ కేశవరెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

దుద్యాల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ముగ్గుపోశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజ, నాయకులు శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట అక్రమాలు

● ఇసుక, మొరం పక్కదారి
● పట్టించుకోని అధికార యంత్రాంగం



మైల్వార్‌లో అక్రమార్కులు కొల్లగొట్టిన మొరం గుట్ట (ఫైల్)

బషీరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లపేరిట అనుమతులు తీసుకొని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇసుక, మొరం అక్రమంగా రవాణాచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలే ఇదంతా జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బషీరాబాద్ మండలంలోని మైల్వార్, దామర్‌చెడ్, కొత్లాపూర్, ఇందర్‌చెడ్, మంతట్టి తదితర గ్రామాల పరిధిలో ఇసుక, మొరం అక్రమరవాణా జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల్లో గ్రామాల్లో ఇందిరమ్మఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈక్రమంలో ఇసుక, మొరంనకు మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. ఇదే అదనుగా రాత్రీపగలు తేడా లేకుండా ఇసుక, మొరం తరలిస్తున్నారు. దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందంగా అక్రమార్కులు ఇసుక, మొరం వ్యాపారం చేస్తూ జోరుగా దందా సాగిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారులను తప్పుదోవ పట్టిస్తూ..

మైల్వార్‌లో ఓ అక్రమార్కుడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరిట రెవెన్యూ అధికారుల వద్ద గురువారం మొరం తరలించేందుకు అనుమతి తీసుకున్నాడు. అయితే ఇందిరమ్మ ఇంటికి మొరం తరలించకుండా, ఇతరుల ఇళ్లకు పెద్దఎత్తున మొరం తరలించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారులను అక్రమార్కుడు తప్పుదోవ పట్టించడమే కాకుండా, సదరు ఇంటియజమాని వద్ద మొరం కోసం ప్రభుత్వానికి డీడీ కట్టాలని భారీగా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు సదరు అక్రమార్కుడు కొందరి పోలీసుల అండాతోనే కొంత కాలంగా ఇసుక, మొరం తవ్వకాలు యథేచ్ఛగా చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు రావడంతో గురువారం మధ్యాహ్నం మైల్వార్ గ్రామానికి చేరుకుని మొరం తవ్వకాలను నిలిపివేశారు. అక్రమార్కులు మొరం డంప్ చేసిన ఇళ్లను రెవెన్యూ అధికారులు తిరిగి వివరాలు సేకరించారు. ఇందిరమ్మ ఇంటి పేరిట అనుమతులు తీసుకుని మొరం అక్రమాలకు పాల్పడిన అక్రమార్కులపై తహసీల్దార్ శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

నాలుగులేన్ల రహదారి పనులు ఆగవు

● గ్రీన్‌ట్రిబ్యునల్ కోర్టు గ్రీన్‌సిగ్నల్
● అప్పాజంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు నిర్మాణం
● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగులేన్ల రహదారి పనులు ఇకపై ఎక్కడా ఆగవని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని మిర్జాపూర్ గేటువద్ద గురువారం బీజాపూర్ జాతీయ రహదారి వద్దకు చేరుకుని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. అప్పాజంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి పర్యావరణ ప్రేమికులు గ్రీన్‌ట్రిబ్యూనల్‌లో వేసిన కేసును కోర్టు కొట్టేస్తూ నిర్మాణానికి ఆదేశాలు జారీచేసిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆదేశాలను జారీచేసిన కోర్టు బుధవారం ఆర్డర్ కాపీని విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈమేరకు నేషనల్‌హైవే అథారిటీ రహదారి పనులను కొనసాగించవచ్చని గ్రీన్‌ట్రిబ్యూనల్ స్పష్టం చేసిందని చెప్పారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా రహదారి పనులు పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడా ఈ రహదారి నిర్మాణానికి అప్పటి రవాణా శాఖ మంత్రి ఆస్కార్ ఫెర్నాండేజ్, అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌డ్డి, అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిని కలిసి ఈప్రాజెక్టును మంజూరు చేయించడంలో తాను కీలకపాత్ర పోషించానని ఎమ్మెల్యే గుర్తుచేశరు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థల సేకరణలో జాప్యం చేయడం, పర్యావరణ ప్రేమికులు వేసిన కేసులు పరిష్కరించడంలో ఆలస్యం చేయడం వల్లే పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రస్తుతం ఈ రహదారి నిర్మాణ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి తనకు అప్పటించారని, వ్యక్తిగతంగా పర్యవేణ చయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇటీవల చేవెళ్ల-మిర్జాపూర్ బస్సు ప్రమాదం బాధాకరమని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారి పనులు వేగవంతం చేస్తామన్నారు.

మహిళలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా

దోమ: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. దిర్సంపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి, ఏపీయం శోభ పాల్గొన్నారు.

కులకచర్ల: కల్యాణలక్ష్మి పథకం పేద ప్రజలకు వరంలాంటిందని ఎమ్మెల్యే అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండలంలోని 80 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబార్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, తహసీల్దార్ మనోహర చక్రవర్తి, మొగులయ్య, మైపాల్‌రెడ్డి, భరత్‌కుమార్, అంజిలయ్యగౌడ్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

త్వరలోనే రైతులకు సన్నాలకు బోనస్

రైతులకు త్వరలోనే సన్నరకం వడ్లకు రూ.500బోనస్ పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కులకచర్ల, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

హామీలన్నింటినీ నెరవేరుస్తాం

పరిగి: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా పరిగిలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంపీడీవో హరిప్రియ, ఏఎంసీ చైర్మన్ పరుశరాంరెడ్డి, ఆత్మచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆచి తూచి

(ఐదో పేజీ తరువాయి)

సివిల్ సప్లయి శాఖకు చేరలేదు. ఇప్పటికే పలు మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ఇప్పుడు కొనుగోలు చేసే ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలనే విషయమై ఇంకా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మిల్లర్లకు అలాట్ చేసిన ధాన్యం బియ్యంగా మార్చి పక్కదారి పట్టించిన ఘటనలు చూశాం. ఇప్పుడు అలా జరుగకుండా పకడ్బందీగా మిల్లింగ్ అయిన బియ్యాన్ని వెంటనే సివిల్ సప్లయి శాఖకు తెచ్చుకునేందుకు కచ్చితమైన నిబంధనలు రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ప్రభుత్వానికి రూ.కోట్లలో బకాయి పడిన మిల్లర్లకు నోటీసులు ఇచ్చారు.

అగ్రిమెంట్‌కు ముందుకొస్తున్న డిఫాల్టర్

తాండూరు కృష్ణసాయి ఇండస్ట్రీస్ రైస్‌మిల్‌కు వడ్లను బియ్యంగా మార్చి ఇచ్చేందుకు సివిల్ సప్లయి శాఖ గతంలో అగ్రిమెంట్ చేసుకుంది. అయితే ఇండస్ట్రీస్ ఓనర్ ఆ రైస్ మిల్‌ను సబ్ లీజ్‌కు ఇవ్వడంతో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి సుమారు రూ.6 కోట్ల మేరకు బకాయి పడ్డారు. తిరిగి సివిల్ సప్లయి శాఖకు చెల్లించాల్సిన బియ్యాన్ని రెండేళ్లలో దశల వారీగా చెల్లిస్తామని, తమకు ధాన్యం బియ్యంగా మార్చి సివిల్ సప్లయి శాఖకు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని మిల్ ఓనర్ రవిగౌడ్ కలెక్టర్‌కు లేఖ పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ మిల్‌కు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదై డిఫాల్టర్ లిస్టులో ఉన్నందున వరి ధాన్యం కేటాయింపు అగ్రిమెంట్ చేసుకోలేమని, బియ్యంకు సంబంధించి నగదుతోపాటు జరిమానా చెల్లించి సివిల్ సప్లయి శాఖ కమిషనర్‌కు లేఖ పెట్టుకుంటే పరిశీలించి అనుమతి ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకుంటామని, ఇది తన పరిధిలో లేదని కలెక్టర్ తేల్చి చెప్పినట్లు సమాచారం.

ఇన్‌చార్జి కమిషనర్‌కు రీపోస్టింగ్!

తాండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసి పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న విక్రం సింహారెడ్డి తిరిగి వికారాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. ఆరోపణలు ఎదుర్కొని డీఎంఏ కార్యాలయానికి ఆయనను అటాచ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో తిరిగి ఇన్‌చార్జి కమిషనర్ పోస్టింగ్ కోసం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో పాటు వికారాబాద్ మాజీ జడ్పీటీసీ, సీఎం సోదరుడి ద్వారా విశ్వప్రయత్నాలు చేసినట్లు చేసినట్లుగా తెలుస్తోంది. గతంలో జహీరాబాద్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలోనూ అక్కడ ఉన్న నాయకులతో ఉన్న సంబంధాలతోట పైరవీలు చేసి పోస్టింగ్ తెచ్చుకున్నారు. విక్రం సింహారెడ్డి పట్ల మున్సిపల్ పరిపాలన విభాగం అధికారులు ఆయనపై సీరియస్‌గా ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పోస్టింగ్ ఇవ్వనున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల తాండూరులో ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ రమేశ్ లంచంతీసుకునే విషయంలో కమిషనర్ విక్రంసింహారెడ్డికీ భాగస్వామ్యం ఉందని ఏసీబీకి ఫిర్యాదుదారుడు ఈర్షద్ తన స్టేట్‌మెంట్‌లో ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ఆయన తిరిగి పోస్టింగ్ సాధించుకోవడం చర్చనీయమైంది.

విజ్ఞానం వికసించేలా..

(ఐదో పేజీ తరువాయి)

దేశాల చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ యుద్ధాలు, వివిధ సామాజిక, రాజకీయ ఉద్యమాలు, భారత రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, ప్రపంచం, మన దేశం గర్వించదగిన నేతలు, శాస్త్రవేత్తలు, జీవిత చరిత్రలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, క్రీడలు, ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, రచయితలు, కవులు, కళాకారులు, సాహిత్యకారులు, వారి రచనలు, కవితల సంపుటాలు, సాంస్కృతిక, పర్యాటక సమాచారం, వైద్యం, ఆరోగ్యం, ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషల నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వం, మనోవైజ్ఞానిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే పుస్తకాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు... ఇలా ఒక్కటేంటి.. అన్ని రంగాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రసిద్ధ క్షేత్రాలు, పర్యాటక స్థలాలు, చట్టాల వంటి వాటిపై అవగాహన కల్పించే పుస్తకాలు కూడా ఉన్నాయి. పాఠ్య పుస్తకాలు, నవలలు, కథలు, కథానికల పుస్తకాలు వేల సంఖ్యలో ఉన్నాయి. విలువైన పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థిక స్థితి లేని విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

పోటీ పరీక్షలకు ప్రత్యేకం

వికారాబాద్‌లో 1959 జూలై 28న జిల్లా కేంద్ర గ్రంథాలయం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఒక జిల్లా కేంద్ర గ్రంథాలయం, 17 శాఖా గ్రంథాలయాలు, మూడు గ్రామ గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో 3,05,766 పుస్తకాలు ఉండగా, 14,250 మంది సభ్యులు ఉన్నారు. గత ఏడాది కాలంలో జిల్లాలోని గ్రంథాలయాలను 3,58,154 మంది పాఠకులు సందర్శించి 3,58,154 పుస్తకాలను చదివారు. సభ్యులు 40,561 పుస్తకాలను తమ ఇళ్లకు తీసుకు వెళ్లారు. గతేడాది రూ.1,11,914 విలువ కలిగిన వివిధ ఆన్ డిమాండ్ పోటీ పరీక్షల పుస్తకాలు 289 కొనుగోలు చేయగా, ఈ ఏడాది రూ.2,63,427 విలువ కలిగిన 737 పుస్తకాలు కొనుగోలు చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకుల కోసం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. దీంట్లో పాఠ్య గ్రంథాలు, పోటీ, ప్రవేశ పరీక్షల పుస్తకాలు, రెఫరెన్స్, తదితర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ ఉద్యోగాల భర్తీకి నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఆన్ డిమాండ్ పోటీ పరీక్షల పుస్తకాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి



నేడు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభిస్తారు.. 15న పుస్తక ప్రదర్శన, పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు ఉంటాయి. అదేరోజు పుస్తక ప్రదర్శన ఉంటుంది. 16న అవగాహన, ఔట్రీచ్ కార్యక్రమాలు, 17న పాఠకుల భాగస్వామ్య కార్యక్రమాలు, సదస్సులు, కవి సమ్మేళనం, ధాన్యం - వ్యక్తిత్వ అభివృద్ధి కార్యక్రమాలు, 18న విద్యార్థుల కేంద్రీకృత కార్యకలాపాలు, వ్యాస రచన, ఉపన్యాసం, చిత్ర లేఖన పోటీలు నిర్వహిస్తాం. 19న మహిళలు, పిల్లలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. 20న అక్షరాస్యత దినోత్సవం, వారోత్సవాల ముగింపు, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుంది. పాఠకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలి.

- పీరం సురేశ్ బాబు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, వికారాబాద్

సంక్షిప్తంగా..

పరీక్ష ఫీజు చెల్లించిన సామాజికవేత్త

తాండూరు రూరల్: జినగుర్తి గ్రామానికి చెందిన సామాజికవేత్త మడపాటి శంకర్ ఆగ్రామంలో చదువుతున్న 40మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.15వేలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ కుమార్ పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

ఘట్‌కేసర్: కొండాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉట్కూరి సత్యనారాయణగౌడ్(85) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. గతంలో ఉమ్మడిఅవుషాపూర్ కొండాపూర్ గ్రామ పంచాయతీకి, అనంతరం కొండాపూర్ గ్రామ పంచాయతీకి సైతం సర్పంచ్‌గా పనిచేశారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీలోనే పనిచేశారు. డీసీసీలో పలు పదవులు పొందారు. కాంగ్రెస్ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

దోమ: గుండాల గ్రామానికి చెందిన తలారి శ్రీను మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగత్‌రెడ్డి, బసప్ప, బాల్‌రాజ్, వెంకటయ్య, వెంకటేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: సాల్విడ్‌లో నర్సమ్మ అనే మహిళ గురువారం అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్ గ్రామానికి వెళ్లి రూ.9వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. డీసీసీబీ డైరెక్టర్, కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య ఆదేశాలతో సాయం అందజేసినట్లు తెలిపారు.

కాళోజీకి ఘన నివాళి



మజీద్‌పూర్‌లో కాళోజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

శామీర్‌పేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు వర్థంతి కార్యక్రమాన్ని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్‌లో ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలుయాదవ్, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి భిక్షపతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తి.. వివాహిత ఆత్మహత్య

దోమ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమ మండలంలోని మోత్కూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై వసంత్‌జాదవ్, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొత్తపేట లక్ష్మయ్య పెద్దకూతురు మహేశ్వరి, చిన్నకూతురు అనూషకు ఇద్దరు సంతానం. వీరు పుట్టుకతోనే మూగ, చెవుడు. చిన్నకూతురు అనూషకు శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అప్పటి నుంచి శ్రీనివాస్ ఇల్లరికం ఉంటున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమె ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు పరిగి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వసంత్‌జాదవ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కీసర రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీను, స్వప్న(40)లు తమ ముగ్గురు కుమారులతో కలిసి దమ్మాయిగూడ మున్సిపాలిటీ శ్రీరామలింగేశ్వర కాలనీ(వికలాంగుల కాలనీ)కి నెల క్రితం వలసవచ్చారు. వీరు కూలీపని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా ఆమె ఉన్నట్టుండి అకస్మాత్తుగా మృతి చెందగా స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను పరిశీలించారు. భర్త శ్రీను ఆమెను హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అతన్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా చెట్లు నరికివేత.. ఆరుగురి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

మేడ్చల్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా చెట్లు నరికి తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టుచేసి రెండు ట్రాక్టర్లను సీజ్‌చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజబొల్లారం తండా శివారులోని అటవీప్రాంతంలో పెంచిన యూకలిప్టస్ చెట్లను తండాకు చెందిన బోనాత్‌గౌతమ్, మాలావత్ లనీల్‌లు గురువారం సాయంత్రం నరికి రెండు ట్రాక్టర్లలో తీసుకెళ్తుండగా పోలీసులు వారిని పట్టుకున్నారు. వారితో పాటు చెట్లు నరకటానికి సహకించిన మలావత్ రాజ్‌కుమార్, బోనావత్ నవీన్, మాలవత్ నాగేష్, మలావత్ గణేష్‌లను అదుపులో తీసుకున్నారు. లోడ్‌తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బొంరాస్‌పేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన జోగు కృష్ణ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లో బతుకుదెరువు కోసం జోగు కృష్ణ కూలీ పనులు చేస్తున్నాడు. బైక్‌పై హైదరాబాద్ నుంచి సొంత గ్రామం దేవనూర్‌కు వస్తుండగా గురువారం బొంరాస్‌పేట్ మండలంలోని బొట్లవనితండా, నాగిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలో 163వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు యాలాల పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పేర్కంపల్లిలో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి చూడగా ఒక ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. అనుమతి పత్రాలు కోరగా, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను యాలాల పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర

శామీర్‌పేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటుధర లభిస్తుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్‌లో, మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలలో శామీర్‌పేట రైతుసహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ నర్సిములుయాదవ్, సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్యయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్, భిక్షపతి, అనిత పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

బొంరాస్‌పేట్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ధాన్యంలో తేమ శాతం 17కు మించకుండా కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలను ఉపేక్షించం

కులకచర్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు జరిగితే ఉపేక్షించబోమని డీఆర్డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. ఉపాధిహామీ పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సంవత్సరం పాటు జరిగిన ఉపాధి పనులను గత 12రోజులుగా ఉమ్మడి మండలంలోని 44గ్రామాల్లో తనిఖీ చేసిన సామాజికబృందం సభ్యులు ఈ సందర్భంగా గ్రామాల వారీగా వివరించారు. పీడీ మాట్లాడుతూ సంవత్సర కాలంలో ఉపాధిలో రూ.14,14కోట్ల పనులు జరిగాయన్నారు. తనిఖీలు నిర్వహించి రూ.38వేలు సంబంధిత సిబ్బందికి జరిమానా, రికవరీ రూ.లక్షా 35వేల 614 రాశామన్నారు. నర్సరీల్లో ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు పెంచాలన్నారు. అక్రమాలు జరిగిన చోట సంబంధిత సిబ్బందికి రికవరీ రాశామని తెలిపారు. ఏటా సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ రంగారెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఏసీ చంద్రశేఖర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

షీటీం అవగాహన

పూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంచన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం షీటీం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి నర్సింహులు మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సోచట్టంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణమాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం సభ్యులు బి. సవిత పాల్గొన్నారు.